తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : రత్నం నారరాజా

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

సోమవారం

13 అక్టోబర్ 2025

సంపుటి 55

సంచిక 3

పేజీలు 6

వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna


# నల్గొండలో గోదావరి నీళ్లు

## పవ్రహిస్తున్నాయంటే ఆయన వల్లే

- ఎస్సారెస్పీ-2 ప్రాజెక్టుకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు ఖరారు
- తుంగతుర్తి సభలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- నల్గొండకు గోదావరి జలాలు ఆయన చలవేనన్న సీఎం
- 24 గంటల్లోనే జీవో జారీ చేస్తామని వెల్లడి
- దామోదర్ రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ
- ఆయన మృతికి సోనియా, ఖర్గే, రాహుల్ సంతాపం తెలిపారన్న సీఎం



తరంగాలు న్యూస్ / డెస్క్ : ఎస్ఆర్ఎస్పీ స్టేజ్ -2 కు దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఎస్సారెస్పీ-2గా నామకరణం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తుంగతుర్తిలో జరిగిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ వారి సేవలను స్మరించుకున్నారు. "రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం అత్యంత బాధాకరం. పార్టీ కోసం, కార్యకర్తల కోసం సొంత ఆస్తులను త్యాగం చేసిన నిస్వార్థ నాయకుడు. అయిదు సార్లు శాసనసభ్యుడిగా, మంత్రిగా పనిచేసిన దామోదర్ రెడ్డి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో వారసత్వంగా వచ్చిన వేలాది ఎకరాల భూములను ప్రజా ప్రయోజనాల కోసం అర్పించారు. నల్గొండ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల కోసం గోదావరి జలాలను తరలించడానికి అలుపెరగని పోరాటం చేశారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు స్టేజ్ -2 ద్వారా నల్గొండ జిల్లాకు గోదావరి జలాలు తరలించాలని ఆనాటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఎస్సారెస్పీ స్టేజ్-2 ప్రారంభమయ్యేలా పోరాటం చేశారు. అందువల్ల ఎస్సారెస్పీ స్టేజ్-2 కి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పేరు పెట్టడం వారికిచ్చే నిజమైన నివాళి..." అని పేర్కొన్నారు.

### 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం

# జేఏసీ ఏర్పాటు

## - చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య

- తెలంగాణలో బీసీల ఐక్య గళం
- 42% రిజర్వేషన్ల కోసం జేఏసీ ఏర్పాటు
- న్యాయం కోసం ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు
- చట్టసభల్లో బిల్లు పెట్టేవరకు పోరాటం ఆగదని కృష్ణయ్య స్పష్టీకరణ



వివరాలు 2 లో..

# లక్నోలో దారుణం

## - బాలికపై ఐదుగురి గ్యాంగ్ రేప్..

- పరిచయస్తుడితో వెళ్తుండగా మామిడి తోటలో దారుణం
- పోలీసుల కాల్పుల తర్వాత ఒక నిందితుడి అరెస్ట్
- మరో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలింపు
- ఘటనపై బీఎస్పీ అధినేత్రి మాయావతి తీవ్ర ఆగ్రహం

వివరాలు 2 లో..

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

## - రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

- జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్
- కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ
- రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ
- 6గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్
- బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా




వివరాలు 2 లో..

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

# నేటి నుంచే నామినేషన్లు

- షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద 144 సెక్షన్ విధింపు
- నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికే లోపలికి అనుమతి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు.. బీజేపీపై ఉత్కంఠ
- 18 చెక్‌పోస్టులతో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు



తరంగాలు న్యూస్ / డెస్క్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల కేంద్రంగా ఉన్న షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఉప ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ర్యాలీలుగా వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల కార్యాలయం వద్దకు వాహనాలను పూర్తిగా నిషేధించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు కేవలం నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించనున్నారు...

2

### దుర్గాపూర్ మెడికో గ్యాంగ్‌రేప్ కేసును

# ఛేదించిన పోలీసులు


- పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం
- కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- నిందితుడి ఫోన్ కాల్ ఆధారంగా కేసును ఛేదించిన వైనం
- పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం డ్రోన్లతో గాలింపు
- ఘటనపై జాతీయ మహిళా కమిషన్ తీవ్ర ఆగ్రహం
- బాధితురాలికి అండగా ఉంటామన్న కాలేజీ యాజమాన్యం



వివరాలు 2 లో..

### ఏడాదికి 240 శాతం వడ్డీ ఆశ..

## నల్గొండలో 50 కోట్ల భారీ మోసం!




- మద్యం వ్యాపారం, స్టాక్ మార్కెట్‌లో భారీగా నష్టపోయిన నిందితుడు
- రమావత్ బాలాజీ నాయక్‌ను అరెస్ట్ చేసిన నల్గొండ పోలీసులు
- రూ.80 లక్షల విలువైన కార్లు, ఆస్తి పత్రాలు స్వాధీనం
- మధ్యవర్తి మృతితో వెలుగులోకి వచ్చిన భారీ మోసం

2

# గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రిలో ఉద్రిక్తత..

## - రోగి మృతితో బంధువుల ఆందోళన

తరంగాలు న్యూస్ / డెస్క్ : హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రి వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాలేయ మార్పిడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందడంతో, వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. భారీగా డబ్బులు వసూలు చేసి, చివరికి ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

వివరాల్లోకి వెళితే, కుత్బుల్లాపూర్‌కు చెందిన మురళీధర్ (40) కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం 45 రోజుల క్రితం ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. కాలేయ మార్పిడి అవసరమని వైద్యులు చెప్పడంతో, అవయవదానం కోసం జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, మురళీధర్ వయసు 40 ఏళు కాగా, ఆసుపత్రి సిబ్బంది పొరపాటున 60 ఏళ్లుగా నమోదు చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ తప్పిదం వల్ల



అవయవదాతలు ఎవరూ ముందుకు రాలేదని, దీంతో చివరికి అతని భార్యే కాలేయాన్ని దానం చేసేందుకు ముందుకొచ్చారని వారు తెలిపారు.

ఈ 45 రోజుల చికిత్స కోసం తాము సుమారు రూ.85 లక్షలు చెల్లించామని, ఉన్న ఒక్క ఇంటిని అమ్మి డబ్బు కట్టామని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, శనివారం మరో రూ.14 లక్షలు చెల్లించిన తర్వాతే మురళీధర్ మృతి చెందినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. డబ్బు కట్టించుకున్న తర్వాత మరణవార్త చెప్పడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైద్యుల నిర్లక్ష్యం, జీవన్‌దాన్‌లో తప్పుడు సమాచారం నమోదు చేయడం వల్లే మురళీధర్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనతో ఆసుపత్రి వద్ద కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# లక్నోలో దారుణం

## - బాలికపై ఐదుగురి గ్యాంగ్ రేప్..



మొదటిపేజీ తరువాయి..

తరంగాలు న్యూస్ / డెస్క్ : ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 16 ఏళ్ల బాలికపై ఐదుగురు దుండగులు సావ–మూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఒకరిని ఎన్‌కౌంటర్ అనంతరం అదుపులోకి తీసుకున్నారు.

పోలీసుల కథనం ప్రకారం బాధితురాలు శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన సోదరి ఇంటికి వెళ్లేందుకు ఒక పరిచయస్తుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై బయలుదేరింది. మా–ర్గమధ్యలో బంత్రా ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మామిడి తోట వద్ద వారు ఆగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఐదుగురు వ్యక్తులు, బాలికతో ఉన్న వ్యక్తిని చితకబాది, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు.

ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ క్రమంలో గత రాత్రి హరౌనీ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా, బైక్‌పై వస్తున్న ఇద్దరు అనుమానితులను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడి కాలికి బుల్లెట్ తగిలింది.

గాయపడిన నిందితుడిని లలిత్ కశ్యప్‌గా గుర్తించామని, అతడిని ఆసుపత్రికి తరలించామని డీసీపీ నిపుణ్ అగర్వాల్ తెలిపారు. గతంలో కూడా లలిత్‌పై జూదం, దొంగతనం కేసులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. సంఘటనా స్థలం నుంచి తప్పించుకున్న మరో నిందితుడు, 20 ఏళ్ల మీరజ్‌ను కూడా రైల్వే స్టేషన్ సమీపంలోనే అరెస్ట్ చేసినట్లు డీసీపీ చెప్పారు. నిందితుల నుంచి ఒక బైక్, నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఆయన వివరించారు.

### మాయావతి తీవ్ర ఆగ్రహం

ఈ దారుణ ఘటనపై బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తీవ్రంగా స్పందించారు. "రాజధాని లక్నోలో బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం అత్యంత బాధాకరం, సిగ్గుచేటు. యూపీతో సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఆగడం లేదు. మహిళల భద్రతకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# ఏడాదికి 240 శాతం వడ్డీ ఆశ..

## నల్గొండలో 50 కోట్ల భారీ మోసం!

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు న్యూస్ / డెస్క్ : ఉఏడాదికి ఏకంగా 240 శాతం వరకు వడ్డీ ఇస్తానని నమ్మబలికి, అమాయక ప్రజల నుంచి రూ.50 కోట్లకు పైగా అప్పులు సేకరించి మోసగించిన రమావత్ బాలాజీ నాయక్‌ను నల్గొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, పలు వ్యాపారాల్లో నష్టపోయిన నిందితుడు ఈ భారీ మోసానికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నల్గొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఈ కేసు వివరాలు తెలిపారు. బాలాజీ నాయక్ తన మోసానికి గురైన వారిని నమ్మించడానికి వినూత్న పద్ధతులు ఎంచుకున్నాడని ఆయన వివరించారు. తన విలాసవంతమైన ఫార్చ్యూనర్, స్కార్పియో కార్లలో తిప్పుతూ, నల్గొండలోని ఐటీ టవర్‌ను చూపించి అది తన బంగ్లా అని చెప్పేవాడు. అంతేకాకుండా, ఖరీదైన విల్లాలు, వెంచర్ల వద్దకు తీసుకెళ్లి అవన్నీ తన ఆస్తులేనని నమ్మించి అప్పులు తీసుకునేవాడు.

ఈ విధంగా సేకరించిన డబ్బును మద్యం వ్యాపారం, స్టాక్ మార్కెట్‌లో ఇంట్రాడే ట్రేడింగ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పెట్టుబడులుగా పెట్టి భారీగా నష్టపోయాడు. కేవలం మద్యం వ్యాపారంలోనే రూ.2.30 కోట్లు, స్టాక్ మార్కెట్‌లో రూ.12.15 కోట్లు పోగొట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నష్టాలు పెరగడంతో, జల్సాలు, విలాసవంతమైన జీవితాన్ని కొనసాగించడానికి మరిన్ని అప్పులు చేయడం మొదలుపెట్టాడు.

ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఉన్న సరియానాయక్ అనే వ్యక్తి తీవ్ర ఒత్తిడితో మరణించడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. అతడి మరణం తర్వాత ధైర్యం చేసిన కొందరు బాధితులు గుడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు బాలాజీ నాయక్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.80 లక్షల విలువైన రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, పలుచోట్ల ఉన్న ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి ఇవ్వనని బాలాజీ నాయక్ బాధితులను బెదిరించడంతో చాలామంది ముందుకు రాలేదని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని, మధ్యవర్తులను నమ్మవద్దని ఆయన సూచించారు. బినామీల పేర్లపై ఉన్న ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీ ఏర్పాటు.. చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు న్యూస్ / డెస్క్ : తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీ) హక్కుల సాధన ఉద్యమం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను సాధించడమే ఏకైక లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి 'తెలంగాణ బీసీ జేఏసీ' (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేశాయి. ఈ ఐక్య కార్యాచరణ కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నేత ఆర్. కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు కీలక సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు ఏ కారణంతో స్టే ఇచ్చిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఆయన పిలుపునిచ్చారు. "గత 76 ఏళ్లుగా బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పుడు దానికి అవమానం కూడా తోడైంది. మా హక్కుల కోసం చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టే వరకు ఈ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు" అని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. బీసీ సమాజం ఐక్యంగా నిలబడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

## - రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్



మొదటిపేజీ తరువాయి..

తరంగాలు న్యూస్ / డెస్క్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివే–స్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

### హామీలన్నీ మోసమే...!

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు.

బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విష–యాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

### బీజేపీపైనా విమర్శలు

ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

# దుర్గాపూర్ మెడికో గ్యాంగ్‌రేప్ కేసును ఛేదించిన పోలీసులు

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు న్యూస్ / డెస్క్ : పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ దారుణానికి పాల్పడిన ముగ్గురు నిందితులను ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితులు చేసిన ఒక చిన్న పొరపాటే ఈ కేసులో పోలీసులకు కీలక ఆధారంగా మారి వారిని పట్టించింది.

ఆదివారం అదుపులోకి తీసుకున్న ముగ్గురి వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఈ కేసులో మొత్తం ఐదుగురిని గుర్తించామని, పరారీలో ఉన్న మిగతా ఇద్దరి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని అసన్‌సోల్–దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

ఫోన్ కాల్‌తో దొరికారిలా..

పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి బాధితురాలు తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లినప్పుడు మొదట కొంతమంది యువకులు వారి ఫోన్లను లాక్కున్నారు. కాసేపటికి మరో ఇద్దరు అక్కడికి వచ్చి, ఏం జరిగిందని ఆరా తీస్తూ సాయం చేస్తున్నట్లు నటించారు. ఈ క్రమంలోనే, బాధితురాలి ఫోన్‌కు తమ మొబైల్ నుంచి కాల్ చేశారు. ఈ ఫోన్ నంబర్ ఆధారంగానే పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. మొదట ఆ నంబర్‌కు సంబంధించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, మిగతా నలుగురి వివరాలు తెలిశాయి.

### అడవిలో డ్రోన్లతో గాలింపు

ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన బాధితురాలు, దుర్గాపూర్‌లోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో సెకండియర్ చదువుతోంది. శుక్రవారం రాత్రి స్నేహితుడితో డిన్నర్‌కు వెళ్లగా, బైక్‌లపై వచ్చిన కొందరు యువకులు వారిని వెంబడించారు. స్నేహితుడిని బెదిరించి పంపించి, యువతిని సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన జరిగిన ప్రాంతం దట్టమైన అడవి కావడంతో అక్కడ సీసీటీవీ కెమెరాలు కూడా లేవు. దీంతో పోలీసులు బైక్‌లు, డ్రోన్ల సహాయంతో మిగతా ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) తీవ్రంగా స్పందించింది. ఐదు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని బెంగాల్ డీజీపీని ఆదేశించింది. మరోవైపు, బాధితురాలు మేజిస్ట్రేట్ ముందు తన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. విద్యార్థినికి పూర్తి అండగా ఉంటామని, పోలీసుల దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని కాలేజీ యా–జమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. నేటి నుంచే నామినేషన్లు

మొదటిపేజీ తరువాయి.. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే 18 మార్గాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచారు. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ తరపున మాగంటి సునీత పేరును ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ కుమార్ బరిలో నిలవనున్నారు. బీజేపీ అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నామినేషన్లు వేయడానికి పది రోజుల సమయం ఉండటంతో, అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు. పశ్చిమ మండలం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో ఈ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 9 మంది ఎస్ఐలతో పాటు 59 మంది సిబ్బంది, రెండు ప్లాటూన్ల బలగాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఈ భద్రతా వలయం కొనసాగుతుందని అధికారులు స్పష్టంచేశారు.

# ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడండి.. ప్రమాదాలను నివారించండి - చింతపల్లి వెంకటయ్య గౌడ్

కల్వకుర్తి అక్టోబర్ 12 తరంగాలు : మాడుగుల మండల్ కలకొండ గ్రామం లో జనని ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్ పోయే దారిలో రోడ్డుమీద బారీ గేట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జనని ఫౌండేషన్ చైర్మన్ చింతపల్లి వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ కలకొండ గ్రామంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాలు జరగకుండా ప్రమాదాలను నివారించుటకై అంబేద్కర్ చౌరస్తా. జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ వెళ్లే దారిలో తన సొంత ఖర్చులతో కలకొండ గ్రామ ప్రజలకు సందేశాన్ని ఇస్తూ ఏర్పాటుచేసిన భారీ గేట్లను పెట్టించడం జరిగింది. గ్రామ యువత పెద్దలు వాహనాలు మెల్లగా నడపాలని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ఇక కలకొండ గ్రామానికి ఎలాంటి అవసరం ఉన్న అన్నివేళలా అందుబాటులో ఉండి తన శాయశక్తుల సమస్యను పరిష్కరించే విధంగా పాటు పడతానని చింతపల్లి వెంకటయ్య గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కలకొండ గ్రామ బచ్చుమోని మలేష్ యాదవ్. సుమన్ గౌడ్. చింతపల్లి మల్లేష్ గౌడ్. సముద్రాల వెంకటయ్య, ఏలేటి నారయ్య, గోరంట్ల చంద్రయ్య. శివ యాదవ్, శీను యాదవ్. బూరెల శేఖర్, తానేష్, పర్వతాలు. ఏలేటి శ్రీను జాంగిర్, జల్లెల శ్రీశైలం, ఉడుతల వెంకటయ్య, నక్కరికంటే వెంకటయ్య, పులి మహేష్. యాదయ్య. సింగం రాము, రాజిరెడ్డి, తాంద్ర చెన్నయ్య, గోరంట్ల శ్రీశైలం నాయిని సత్యనారి, డొంకి శేఖర్, గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది.






# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య

జఫర్గడ్ ప్రతినిధి, అక్టోబర్ 12, (తరంగాలు) మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులు నీలం రాజయ్య, నీలం రమేష్ తండ్రి నీలం రామచంద్రు మరణించినందున నీలం రామచంద్రు పార్థివ దేహాన్ని స్టేషన్ ఘనపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. వారి తో పాటు జఫర్గడ్-2 గ్రామ శాఖ అధ్యక్షులు మంచాల అనిల్ కాంగ్రెస్ నాయకులు నల్లబోయిన రాజు గుద్దేటి స్వామి మామిడాల మధు అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిదులు, ముఖ్య నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు మరియు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



# ముదిరాజ్ కుటుంబానికి మెపా ఆర్థిక సాయం

- వాకిటి రాజు ముదిరాజ్ పిల్లల ఉద్యోగ భద్రత కు మెపా హామీ
- మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్

పర్వతగిరి, తరంగాలు (అక్టోబర్ 12) : మండలంలోని ఏనుగల్లు గ్రామంలో ఇటీవల గుండెపోటు తో మృతి చెందిన వాకిటి రాజు కుటుంబానికి ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా)ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతి బిడ్డలు ఎక్కడ ఆపదలో ఉన్న మెపా అండగా ఉంటుందనీ, ముదిరాజ్ బిడ్డల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక సంఘం మెపా అని అన్నారు. ఈ క్రమంలోనే రాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా వాకిటి రాజు భార్య రజిత, పిల్లలు బన్నీ, సాత్విక, హర్షిణి, రాజు తల్లి సారమ్మకు 28,000 రూపాయలను మెపా ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం మెపా రాష్ట్ర గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాజకీయంగా ముదిరాజ్ లు ఎదగాలని అన్నారు. మెపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ మాట్లాడుతూ... పిల్లలకు విద్య మరియు ఉద్యోగం కు మెపా తరపున హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ముదిరాజులు కష్టపడి కుటుంబాలను పోషిస్తూ.. ఆరోగ్యం గురించి పట్టించుకోరని.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని అన్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఏనుగల్లు ముదిరాజ్ ల ఐక్యత ప్రతి ముదిరాజ్ కు ఆదర్శంగా ఉందన్నారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్, వరంగల్ జిల్లా మెపా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, ఉపాధ్యక్షులు చెట్టబోయిన శ్రీనివాస్, వరంగల్ జిల్లా నాయకులు గౌరబోయిన అశోక్, వాకిటి రవి, చెన్నారావుపేట మెపా నాయకులు రోడ్డ కుమారస్వామి ముదిరాజ్, ఏనుగల్లు కుల పెద్దమనిషి నర్ర సూరయ్య, చెట్టబోయిన రాములు, సొసైటీ అధ్యక్షులు తోట రాములు, ఉపాధ్యక్షులు మొద్దు సత్యం, డైరెక్టర్లు ధోనీ సంపత్, మొద్దు దేవేందర్, ఇప్ప కుమారస్వామి, ధోనీ కుమార్, నర్ర చంద్రమౌళి, మహేందర్, గుండా కొమ్మాలు, తోట చంద్రమౌళి, గుండా కుమార్, వాకిటి సుధాకర్, తౌటి సదయ్య, యాకయ్య, స్వామి, అనిల్, రాజు, ధోని నరేందర్, నూనె సతీష్, ఉడుతల సంతోష్, మొద్దు పరుశరాములుతో పాటు కుటుంబ సభ్యులు, కుల బంధువులు పాల్గొన్నారు.



# పొలంలో మొసలి కలకలం



నర్సంపేట అక్టోబర్ 12 తరంగాలు: ఖానాపురం మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో గల వరి పొలంలో ఆదివారం మొసలి ప్రత్యక్షమైంది పొలం పనులకు అటుగా వెళ్లిన రైతులు మొసలిని చూసి భయాందోళనకు గురయ్యారు వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని మొసలిని పట్టుకునే చర్యలు చేపట్టారు

# అంగడి స్థలం... అన్యాక్రాంతం

- ❖ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో అంగడి స్థలం
- ❖ చోద్యం చూస్తున్న అధికారులు

నర్సంపేట, అక్టోబర్ 12, తరంగాలు : నర్సంపేట పట్టణంలోని అంగడి ప్రాంగణంలో గల పశువుల క్రయవిక్రయాల చేసుకునే ప్రభుత్వ స్థలం కొంతమంది ప్రైవేటు వ్యక్తుల వ్యాపారాలకు నిలయంగా మారింది. వివరాల్లోకి వెళితే నర్సంపేట అంగడి స్థలంలో ప్రతి ఆదివారం వందలాది వ్యాపారులు రైతులు పశువుల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగడి మైదానంలోని ప్రతి ఆదివారం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామస్తులు వ్యాపారం కోసం పశువుల క్రయవిక్రయం కోసం అంగడి మైదానం ఉపయోగిస్తూ ఉంటారు మున్సిపాలిటీ అధికారులు ఈ అంగడి మైదానాన్ని వేలం వేసి డబ్బులు తీసుకుంటారు ఈ అంగడి మైదానాన్ని నేడు కొద్ది మంది ప్రైవేటు వ్యక్తుల వ్యాపారాలకు అడ్డాగా మారాయి ముఖ్యంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మొరం డంపింగ్ చేసుకొని వ్యాపారాలు సాగిస్తున్నట్లు సమాచారం. నర్సంపేట మున్సిపాలిటీ ఆధీనంలో ఉండే ఈ మైదానం అధికారుల అండదండలు లేకుండానే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందా అని ప్రజలు ఆలోచనలో పడ్డారు. మున్సిపాలిటీ అధికారుల అండదండతోనే మొరం డంపింగ్ కొనసాగుతుందా లేక ఏ అధికారి కూడా మమ్మల్ని ఏమీ చేయలేడు అనే ధోరణితో నడుస్తుందా అనేది తెలియాల్సి ఉంది ఏది ఏమైనా ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగడి స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది.



# పారా అథ్లెట్ జీవంజి దీప్తి దేశానికి గర్వకారణం - రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి

పర్వతగిరి, తరంగాలు(అక్టోబర్ 12) : ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ లో జరుగుతున్న విర్చ్యూస్ వరల్డ్ అథ్లెటిక్ ఛాంపియన్షిప్ 2025లో వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన అథ్లెట్ జీవంజి దీప్తి ఆదివారం జరిగిన ఫైనల్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా.. రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు పర్వతగిరి మండల ముద్దుబిడ్డ పారా అథ్లెట్ జీవంజి దీప్తికి మరియు దీప్తి కోచ్, వారి తల్లిదండ్రులకు హార్దిక శుభాభినందనలు తెలియచేశారు. ఇలాంటి మరెన్నో పథకాలు సాధించాలని కోరుకుంటూ.. దేశం నలుమూలల, కాకతీయ గడ్డ పైన జీవంజి దీప్తి పేరు చిరస్థాయి లో నిలిచి ఉంటుందని అన్నారు.





# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

నర్సంపేట అక్టోబర్ 12 తరంగాలు నర్సంపేట మండలంలోని కమ్మపెల్లి గ్రామానికి చెందిన తప్పెట్ల సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు 50 కేజీల బియ్యాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మిట్టగడుపుల మల్లయ్య ప్రధాన కార్యదర్శి చిలువేరు శ్రీనివాస్ ఉపాధ్యక్షులు అల్లే రవికుమార్ మాజీ సర్పంచ్ వలుగుబెల్లి రంగారెడ్డి మాజీ ఉపసర్పంచ్ మిట్టగడుపుల తిరుపతి సీనియర్ నాయకులు బీరం మాధవరెడ్డి మిట్టగడుపుల చిరంజీవి మల్లారెడ్డి పెండ్యాల మునేందర్ శ్రీనివాస్ రెడ్డి పెండ్యాల బిక్షపతి సాంబరాతి రాజు తో పాటు పార్టీ నాయకులు ఉన్నారు.



# గోల్డ్ మెడల్ సాధించిన జీవాంజి దీప్తిని అభినందించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే



పర్వతగిరి,తరంగాలు(అక్టోబర్ 12) : మండల పరిధిలోని కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తి ఆస్ట్రేలియా లోని బ్రిస్బేన లో వర్చుస్ వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ 2025లో మూడు రోజులుగా జరుగుతున్న పోటీలో ఆదివారం జరిగిన ఫైనల్లో గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు జీవాంజి దీప్తిని మరియు ఆమె కోచ్ ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదేవిధంగా దీప్తి భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం సత్తా చాటాలి

- బలం ఉన్న గ్రామాల్లో సిపిఎం ఎంపీటీసీ, సర్పంచి అభ్యర్థుల పోటీ
- సిపిఎం శ్రేణులు సైనికుల పోరాడాలి



పాలేరు ఆర్సీ, 12 అక్టోబర్ (తరంగాలు) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలం నుండి ఎంపీటీసీ, సర్పంచి అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో గెలిపించుకొని సిపిఎం సత్తా చాటాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని పద్మారెడ్డి భవనంలో జరిగిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ( కోర్టు తీర్పు) బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు వెళ్తారా.. లేదా.. 50% రిజర్వేషన్ దాటకుండా ఎన్నికల వెళ్తారా ..అనేది వేచి చూడాలని, రానున్న కోర్టు తీర్పుకు అనుకూలంగా రిజర్వేషన్లు లో మార్పులు, చేర్పులు, ఉన్న, లేకున్నా మండలంలో సిపిఎం పార్టీ బలంగా ఉన్న అన్ని గ్రామాలలో సిపిఎం ఎంపీటీసీ, సర్పంచుల అభ్యర్థులను పోటీలో ఉంటారని, సిపిఎం శ్రేణులు పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. యడవల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గ వీటి సరళ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, బసిరుద్దీన్, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు ఎర్రబోయిన భారతి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బిక్కసాని గంగాధర్, కర్ణబాబు గన్యా నాయక్, వివిధ గ్రామాల పార్టీ శాఖ కార్యదర్శులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# నిర్దేశిత వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందించాలి కలెక్టర్

## - జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



తరంగాలు, మెదక్ జిల్లా, అక్టోబర్ 12 : కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆదివారం ఉదయం ఆకస్మికంగాహొతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి రిజిస్టర్ సిబ్బంది హాజరు పట్టిక మందుల స్టాక్ రిజిస్టర్ ఆసుపత్రి పరిసరాలు పరిశీలించి వైద్యాధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు సీజనల్ వ్యాధుల కేసులు వాటికి సంబంధించిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా సీజనల్ వ్యాధుల నియంత్రణ పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలి సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా అవసరమైన చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్లవేళలా వైద్యులు అప్రవ-ుత్తంగా ఉండాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు విశేష కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు



# మండలంలో ముమ్మరంగా ఆరోగ్య పరీక్షలు..



పాలేరు ఆర్సీ, 12 అక్టోబర్ (తరంగాలు ) : పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో ముత్యాలగూడెం, చేగొమ్మ గ్రామాలలో సీఎస్సీ (కామన్ హెల్త్ సర్వీస్ సెంటర్) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శని, ఆదివారాలలో లేబర్ కార్డు ఇన్సూరెన్స్ కలిగి కలిగిన వారికి 25 వేల రూపాయలు విలువ చేసే ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ ఆరోగ్య పరీక్షల్లో 58 రకాల ఆరోగ్య పరీక్షలు మూడు నెలల వరకు ఉపయోగపడే విధంగా ఉంటాయని ప్రతి సంవత్సరానికి ఒకసారి నిర్వహించే ఈ వైద్య పరీక్షలను గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు అత్యవసరంగా ఈ పరీక్షల ఫలితాలలో క్యాన్సర్, ఎయిడ్స్, మొదలైన జబ్బులు ఉంటే వారిని వెంటనే గుర్తించి వారికి తగిన చికిత్స చేసే విధంగా సీఎస్సీ వైద్య పరీక్షలు తోడ్పడుతాయని బాధ్యులు తెలిపారు. ఈ ఆరోగ్య పరీక్షలలో ముందుగా లేబర్ కార్డు ఉన్నవారికి రిజిస్ట్రేషన్ చేసి అనంతరం రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించి అనంతరం బార్ కోడ్ పద్ధతిలో ఆన్లైన్లో నిర్వహించి సమాచారం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్సీ క్యాంప్ కోఆర్డినేటర్ అశోక్, సభ్యులు సాయితేజ, శ్రీలత, జిలాని, రాజు, మణికంఠ, గణేష్ పాల్గొన్నారు. ఇప్పటివరకు చేగొమ్మ, ముత్యాల గూడెం గ్రామాలలో రెండు వందల మందికి ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

# రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలి..

- నేటి ఆందోళన విజయవంతం చేయండి..
- జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య.



పాలేరు ఆర్సీ, 12అక్టోబర్ (తరంగాలు) రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 13న (నేడు) జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం పాలేరులోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం మండలశాఖ అధ్యక్షులు వెల్లంపల్లి రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కళ్యాణ కృష్ణయ్య ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెల 700 కోట్లు ఇచ్చి వారి బకాయిలను చెల్లిస్తామని ప్రకటించి బకాయిలను విడుదల చేయకుండా అనేకమంది రిటైర్డ్ ఉద్యోగులు బలవన్మరణానికి గురికాడానికి ప్రభుత్వ వైఖరి కారణమని తెలిపారు. ముఖ్యంగా 2024 మార్చి తదుపరి రిటైర్ అయిన ఉద్యోగులకు నేటి వరకు కేవలం పెన్షన్ తప్ప ఎలాంటి బకాయిలు చెల్లించకపోవడంతో ఆందోళన చెంది అనారోగ్యం పాలై మరణించారన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఇప్పటికైనా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి తాళ్లూరు వేణు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 7,000 మంది పైగా రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. వారికి అనారోగ్యానికి గురి అయినప్పుడు వైద్య సౌకర్యం పొందాలంటే ఆరోగ్య కార్డులు అన్ని ఆసుపత్రులలో చెల్లుబాటు కాకపోవడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు వారు ఉద్యోగంలో ఉన్నప్పుడు దాచుకున్న జీపీఎఫ్, గ్రాడ్యుటీ అర్జిత సెలవు తదితర బకాయిలను విడుదల చేయకపోవడంతో అనేకమంది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా వెంటనే వారి బకాయిలు చెల్లించాలి లేకపోతే 10శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పు ఇచ్చినప్పటికీ ఉన్నత న్యాయస్థానాల తీర్పును కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని దీనివలన ఎందరో రిటైర్డ్ ఉద్యోగులు మానసిక వేదనతో ఉన్నారని నేటి వరకు ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయని పిఆర్సి ప్రయోజనాలు అందరిని ద్రాక్ష లాగా ఉందని. రిటైర్డ్ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13 సోమవారం రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన ప్రదర్శనలు జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సాంబశివరావు, నేలకొండపల్లి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్ రంగారావు, శాఖ కార్యదర్శి వెంకట అప్పారావు, నాయకులు భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ముందుగా ఇటీవల మరణించిన రామ్మూర్తి తదితరుల మరణానికి సంతాపాన్ని ప్రకటించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వెల్లంపల్లి రామయ్య, కార్యదర్శిగా వెంకట అప్పారావు, లను

# ఎన్నికల్లో సత్తా చాటాలి

## - బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ రెడ్డి



నర్సంపేట అక్టోబర్ 12 తరంగాలు : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజెపి శ్రేణులు అత్యధిక స్థానాల్లో గెలిచి సత్తా చాటాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు ఆదివారం నర్సంపేట నియోజకవర్గం లోని నల్లబెల్లి మండలం రంగాపురం ఎంపీటీసీ స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రానా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అన్ని స్థానాల్లో పోటీ చేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని పేర్కొన్నారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకు తీసుకెళుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీసీలపై లేని ప్రేమ కాంగ్రెస్ పార్టీ ఉన్నట్లు నటిస్తోందని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లని జీవో ద్వారా బీసీ సామాజిక వర్గాన్ని నామీద ఉద్ధరిస్తున్నట్లు డ్రామాలు ఆడుతోంది తప్ప వారికి బీసీలపై ప్రేమ లేదన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాపరెడ్డి దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వి జిల్లా నాయకులు వనపర్తి మల్లయ్య, వెంకటేశ్వర్, వల్లే పర్వతాలు మండల ప్రధాన కార్యదర్శిలు నాగరాజు గుగులోతు తిరుపతి ఉపాధ్యక్షులు గుర్రపు నరేష్ కార్యదర్శి మర్రి నాగరాజు కోశాధికారి మురికి మనోహర్ మండల నాయకులు ఓరుగంటి రాజు ముల్క రాజేష్ నాగిరెడ్డి రాజిరెడ్డి రాజేందర్ శివ పద్మ రాజు విజేందర్ రవి రాజేంద్రప్రసాద్ తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏనుగు భారతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన చల్లమల్ల

తరంగాలు, యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 12 : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రము లోని ఏనుగు భారతమ్మ కుటుంబాన్ని పరామర్శించిన చల్లమల్ల కృష్ణారెడ్డి. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పదివేలరూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాసమల్ల యాదయ్య మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు సిలువేరు నర్సింహ సీనియర్ నాయకులు చెక్క నరసింహ బైకనినరేందర్ యాదవ్. మినుగు గోపాల్ చింతల లింగస్వామి, ఏనుగు శ్రీను ఏనుగు మోహన్, ఏనుగు లాలు, బోయ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

తరంగాలు న్యూస్ / మెదక్ జిల్లా / అక్టోబర్ 12 : ప్రజలు సైబర్ నేరాల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని జిల్లా పోలీస్ అధికారి డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలియచేశారు. ఇటీవల జరుగుతున్న నేరలను గురించి ప్రస్తావిస్తూ లోన్ యాప్ మోసాలు జాబ్ ఫ్రాడ్స్ ఏపీకే ఫైల్స్ ద్వారా డేటా దొంగతనం, బిట్‌కాయిన్ / క్రిప్టో కరెన్సీ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు.

**లోన్ యాప్ మోసాలు:**
తక్కువ వడ్డీతో వెంటనే లోన్ ఇస్తామని చెప్పి కొన్ని యాప్‌లు ప్రజల మొబైల్ ఫోన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి తరువాత డబ్బులు వసూలు చేయడమే కాకుండా ఫోటోలు కాంటాక్ట్‌లు ఉపయోగించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. గూగుల్ ప్లే స్టోర్ లేదా అధికారిక వెబ్‌సైట్‌ల ద్వారా మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేయాలని సూచించారు.

**జాబ్ ఫ్రాడ్స్:**
ఉద్యోగం ఇస్తామనే నెపంతో కొంతమంది మోసగాళ్లు సోషల్ మీడియా వాట్సాప్ టెలిగ్రామ్ ద్వారా డబ్బులు అడిగి మోసం చేస్తున్నారు. ఏ విధమైన ఫీజులు ముందుగా చెల్లించవద్దని ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే అప్లై చేయాలని ప్రజలకు సూచించారు.

**ఏపీకే ఫైల్స్ మోసం:**
తెలియని లింకుల ద్వారా ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ చేయడం ద్వారా ఫోన్‌లోని ఫోటోలు బ్యాంక్ వివరాలు ఓటీపీ లు హ్యాకర్లకు చేరే ప్రమాదం ఉందని చెప్పారు. తెలియని వ్యక్తుల లింకులు క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.

**బిట్‌కాయిన్ / క్రిప్టో మోసాలు:**
తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని చెప్పి అనధికారిక వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేయమని ఆకర్షించే మోసగాళ్లను నమ్మరాదని సూచించారు. ఇటువంటి ఇన్వెస్ట్‌మెంట్స్ చట్టబద్ధమైనవి కావని ప్రజలు ఆర్థిక నష్టాలు చవిచూడకుండా జాగ్రత్తపడాలని తెలిపారు.

సైబర్ మోసాలకు గురైనవారు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కి కాల్ చేయవచ్చు లేదా www.cybercrime.gov.in



వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

గోల్డెన్ అవర్స్ లో పిర్యాదు చేసినట్లయితే మీ డబ్బులను వేరే ఖాతాలోకి వెళ్లకుండా ఫ్రీజ్ చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తగా ఉండాలని తెలియని మెసేజ్‌లు కాల్స్ నమ్మవద్దని తెలియని లింక్ లను క్లిక్ చేయవద్దు అని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# అమ్మ వారి దర్శనం లేక 57 రోజులు

- తగ్గని గంగా ప్రవాహం
- రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు
- ఏడుపాయల దేవస్థానం ఈవో చంద్ర శేఖర్ రెడ్డి









తరంగాలు, మెదక్ జిల్లా, అక్టోబర్ 12 : మెదక్ జిల్లా ఏడుపాయల శ్రీ వనదుర్గా భవాని దేవస్థానం గత ఆగస్టు 14 తేదీ న మొదలైన సింగూరు వరద ప్రవాహం సెప్టెంబర్ 12/13 తేదిలో కొంత శాంతించడంతో తిరిగి గర్భాలయం దర్శనం కల్పించినారు 13 తేదీ సాయంత్రం తిరిగి వరద ప్రవాహం కొనసాగితోంది గత 59 రోజులలో రెండు రోజులు వరద తగ్గడం తో దర్శనం కల్పించినారు తిరిగి వరద ప్రవాహం అంతకంతకు పెరుగుతోంది కాని తగ్గడం లేదు గత వారం రోజులుగా ప్రవాహం తగ్గిన గర్భాలయం కు పోలేని పర్స్థితి నెలకొంది ప్రవాహం పూర్తిగా తగ్గిన సుమారు వారం రోజుల సమయం పడుతుంది గర్భాలయ దర్శనం కోసం వరద ప్రవాహం కు ప్రసాదం కౌంటర్ అమ్మవారి ముఖ మండపం చుట్టూ ఉన్న రేకుల షేడ్ అమ్మవారి ముందు ధ్వజస్తంభం వద్ద ఉన్న బలిపీఠం (సింహ వాహనం) సైతం నీటీ ప్రవాహం కు కొట్టుకు పోయింది మండపం చుట్టూ ఉన్న గ్రిల్స్ క్యూలైన్ల గ్రిల్స్ మెట్లు పూర్తిగా కొట్టుకు పోయినాయి. దసర ఉత్సవాలు రాజగోపురం లో జరిపించారు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు అయిన గంగమ్మ శాంతించడం లేదు అమ్మవారి దర్శన భాగ్యం భక్తులకు కల్గడం లేదు. భక్తులు అర్చకులు ప్రవాహం తగ్గాలని అమ్మవారిని కోరుకుంటున్నారు.

# లాంగ్ క్రికెట్ టోర్నమెంట్ విన్నర్

తరంగాలు, సంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 12 : మెతడిస్ట్ ఫెల్లోషిప్ జహీరాబాద్ ఆధ్వర్యంలో 10 రోజులుగా నిర్వహించిన మెతడిస్ట్ లాంగ్ బౌండరీ క్రికెట్ టోర్నమెంట్ లో స్థానిక క్రిస్టియన్ కాలనీ క్రికెట్ జట్టు టోర్నీ విజేత గా నిలి చింది. ఈ టోర్నమెంట్ లో మొత్తం 42క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నాడు స్థానిక ఎం ఆర్ హెచ్ ఎస్ గ్రౌండ్స్ లో అల్లీపూర్, క్రిస్టియన్ కాలనీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ లో క్రిస్టియన్ కాలనీ జట్టు గెలిచి, టోర్నమెంట్ లో విజేత గా నిలిచింది. గెలుపొందిన విన్నర్ జట్టుకు కప్ తో పాటు 20,999 రూపాయలు నగదు బహుమతి ని, రన్నర్ జట్టు కు కప్ తో పాటు 14,999రూపాయలు నగదు బహుమతి ని నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమం లో మెత్తడిస్ట్ జిల్లా సూపరింటెండెంట్ రెవరెండ్ ఎం సుకుమార్ తో పాటు జిల్లా లే లీడర్ సరిన్ జాన్, జిల్లా కార్యదర్శి వై రవి కుమార్, ఎం ఆర్ హెచ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ సబితా స్వరాజ్, హాస్టల్ సూపరింటెండెంట్ సంతోషమ్మ, ఎం వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి స్నేహిత్ షీల్, జిల్లా ఎం వై ఎఫ్ అడ్వైజర్ పి స్వణీత్ షీల్, ఇజ్రాయెల్ బాబీ తదితరులు పాల్గొన్నారు.




# ట్రాక్టర్ డీ కొని వృద్ధుని దుర్మరణం






తరంగాలు, గరిడేపల్లి, అక్టోబర్ 12 : గరిడేపల్లి హెడ్ కానిస్టేబుల్ యమ్ రవి తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి గ్రామానికి చెందిన 75 సంవత్సారాల వయసు కలిగిన బొంత సైదిరెడ్డి ఆధివారం రోజు ఉదయం 11.40 గంటల సమయంలో పొనుగోడు గ్రామ శివారులో తన బంధువుల ఫంక్షన్ కు తన యెక్క ఎపీ 24 ఎఎఫ్ 4245 నెంబర్ గల టివిఎస్ ఎక్స్ఎల్ పై వెళ్తూ గుండాలమ్మ గుడి వద్ద రోడ్ దాటుకుండగా అదే సమయంలో అప్పన్నపేట గ్రామం నుండి గరిడేపల్లి వైపు వస్తున్న టిఎస్ 29 టి 2405 నెంబర్ గల ట్రాక్టర్ డ్రైవర్ బచ్చలకూరి బాబు అను అతను తన యెక్క వాహనాన్ని అతివేగంగా,అజాగ్రత్తగా మరియు నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి మృతుని వాహనానికి టక్కర్ ఇచ్చి ప్రమాదం చేయగా మృతునికి తలకు, ఛాతీపై బలమైన గాయాలు కాగా, చికిత్స నిమిత్తం మిర్యాలగూడ తీసుకవెళుతున్న మార్గ మధ్యలో చనిపోయాడని మృతుని కుమారుడు బొంత మట్టారెడ్డి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించామని ఎస్ఐ గరిడేపల్లి చలికంటి నరేష్ తెలిపారు. స్థానిక గ్రామ పెద్దలు విద్యవంతులైన యువజన నాయకులు, పలువురు మాట్లాడుతూ ఈ విధంగా గతంలో కూడా రోడ్డు దాటుతున్న సమయంలో అతి వేగంగా వస్తున్న పెద్ద పెద్ద వాహనాలు డికొట్టి ఎన్నో యాక్సిడెంట్ లు జరిగి ఎందరో ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఇటువంటి యాక్సిడెంట్ జరగకుండా ఆ బై పాస్ రహదారి ని మూసివేసి యాక్సిడెంట్ లను నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు పలు సూచనలు సలహాలు చేశారు.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొడ్డు బిక్షపతి గౌడ్ ని సన్మానించిన హైకోర్టు అడ్వకేట్, టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఈసారపు సైదులు గౌడ్



తరంగాలు, గరిడేపల్లి, అక్టోబర్ 12 : రంగారెడ్డి జిల్లా ఫోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా బొడ్డు బిక్షపతి గౌడ్ నియమితులయ్యారు. వివరాల్లోకి వెళ్ళితే సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన హైకోర్టు ప్రముఖ న్యాయవాది, రంగారెడ్డి జిల్లా కోర్టు టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఈసారపు సైదులు గౌడ్ సన్మానించారు. వారు మాట్లాడుతూ నిర్దోషులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తారని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అడ్వకేట్ సైదులు గౌడ్ తో పాటు తాళ్ళ మల్కాపురం గ్రామానికి చెందిన వట్టికూటి అంజయ్య గౌడ్ సన్మానించిన వారిలో ఉన్నారు.

# విజయ్ దేవరకొండ కొత్త సినిమా షురూ.. - హీరోయిన్‌పై ఫుల్ క్లారిటీ!



హీరో విజయ్ దేవరకొండ అభిమానులకు ఎదురుచూపులు ముగిశాయి. తన తదుపరి చిత్రాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, ఈ సినిమాలో హీరోయిన్‌గా స్టార్ నటి కీర్తి సురేష్ దాదాపు ఖరారయ్యారు. హైదరాబాద్‌లో నిరాడంబరంగా జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి కీర్తి సురేష్ హాజరు కావడంతో ఈ వార్తకు బలం చేకూరింది. ఈవెంట్ నుంచి బయటకు వచ్చిన ఫోటో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'రాజావారు రాణిగారు' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు రవి కిరణ్ కోలా ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాత దిల్ రాజు దీనిని నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంతో కూడిన పక్కా గ్రామీణ, మాస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే విడుదల చేసిన "కత్తి నేనే.. నెత్తురు నాదే.. యుద్ధం నాతోనే.." అనే క్యాప్షన్‌తో ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. విజయ్ దేవరకొండ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. 'లైగర్', 'ఖుషి' వంటి చిత్రాల తర్వాత సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న విజయ్ దేవరకొండ, ఈసారి పక్కా ప్రణాళికతో వస్తున్నట్లు సమాచారం. ప్రతిభావంతుడైన దర్శకుడు, బలమైన నిర్మాణ సంస్థతో పాటు విజయ్-కీర్తి సురేష్‌ల ఫ్రెష్ కాంబినేషన్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. స్క్రిప్ట్ పనులు పూర్తయినందున, చిత్ర యూనిట్ త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రామ్ చరణ్ ను అభినందించిన ప్రధాని మోదీ



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన అర్ధాంగి ఉపాసన కొణిదెల, మామగారు అనిల్ కామినేనితో కలిసి నిన్న ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం కావడం తెలిసిందే. ప్రపంచంలోనే మొట్టమొదటి ప్రొఫెషనల్ ఆర్చరీ (విలువిద్య) లీగ్ అయిన 'ఆర్చరీ ప్రీమియర్ లీగ్' (ఏపీఎల్) తొలి ఎడిషన్ విజయవంతం కావడంపై వారు ప్రధానితో చర్చించారు. దీనిపై ప్రధాని మోదీ నేడు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "రామ్ చరణ్, ఉపాసన, అనిల్ కామినేని గారితో సమావేశం కావడం సంతోషంగా ఉంది. విలువిద్యను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి మీరు చేస్తున్న సమష్టి కృషి ప్రశంసనీయం. మీ ప్రయత్నాల వల్ల అసంఖ్యాక యువతకు మేలు జరుగుతుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సమావేశంపై రామ్ చరణ్ కూడా స్పందిస్తూ, ప్రధానిని కలవడం గౌరవంగా ఉందని తెలిపారు. "భారతీయ సంస్కృతిలో విలువిద్యకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ లీగ్ ద్వారా మన క్రీడాకారుల ప్రతిభను అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లాలన్నదే మా ఆకాంక్ష. దేశంలో అపారమైన ప్రతిభ ఉంది, ఏపీఎల్ వారికి సరైన వేదికను అందిస్తుంది" అని ఆయన అన్నారు. విలువిద్య వారసత్వాన్ని కాపాడటంలో ఇది తమ వంతు చిన్న ప్రయత్నమని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ఏపీఎల్ చైర్మన్‌గా ఉన్న అనిల్ కామినేని నేతృత్వంలో ఈ లీగ్‌ను ప్రారంభించారు. ఔత్సాహిక క్రీడాకారులకు వృత్తిపరమైన శిక్షణ, అంతర్జాతీయ అవకాశాలు కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం.



# అల్లు అర్జున్ సినిమా ఓ ప్రయోగం...



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణే జంటగా ప్రముఖ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించి అట్లీ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. తమ చిత్రం ఒక సాధారణ సినిమా కాదని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా సరికొత్త దారిని తామే సృష్టిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల బెంగళూరులో జరిగిన ఒక పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన అట్లీ, ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. తన తదుపరి చిత్రం '%ూూ22ఇూ%6' (వర్కింగ్ టైటిల్) షూటింగ్ గురించి అప్‌డేట్ ఇచ్చారు. "సినిమా షూటింగ్ చాలా బాగా జరుగుతోంది. ఇది అందరూ తీసే రొటీన్ సినిమా కాదు. ఈ జానర్‌కు ప్రత్యేకమైన రూల్స్ ఏవీ లేవు, అందుకే మేమే ఒక కొత్త మార్గాన్ని సృష్టిస్తున్నాం. ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం" అని ఆయన వివరించారు. ఇంత భారీ బడ్జెట్‌తో సినిమా తీయడం రిస్క్ కాదా? అని మీడియా ప్రశ్నించగా, అట్లీ ఆసక్తికరంగా స్పందించారు. "ఇది నాకు రిస్క్ అనిపించడం లేదు. ఈ ప్రాజెక్ట్‌ను నేను ఎంతో ఆస్వాదిస్తున్నాను. ఈ సినిమా ప్రేక్షకులకు సంపూర్ణంగా కొత్తదనాన్ని పంచుతుంది. వారి ఆలోచనా విధానాన్ని, సినిమా చూసే పద్ధతిని మార్చేలా చిత్రాన్ని రూపొందిస్తున్నాం" అంటూ ధీమాను వ్యక్తం చేశారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, అద్భుతమైన విజువల్స్‌ను ఉపయోగిస్తున్నట్లు అట్లీ తెలిపారు. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నామని, మరిన్ని వివరాలను రానున్న నెలల్లో వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# కె-ర్యాంప్ సినిమా వాళ్ల కోసమే చేశాను

## - కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'కె-ర్యాంప్' ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలు స్పష్టంగా కనిపించాయి. దీపావళి కానుకగా అక్టోబర్ 18న థియేటర్లలోకి రానున్న ఈ చిత్రంపై చిత్ర బృందం పూర్తి ధీమా వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, అభిమానుల తాకిడికి ఆనందం వ్యక్తం చేశారు. "నన్ను ఎనర్జిటిక్, వినోదాత్మక పాత్రల్లో చూడాలనుకునే నా అభిమానుల కోసమే ఈ సినిమా చేశాను. నా గత చిత్రాలకు ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. ఇందులో నా పాత్ర నేటి యువతకు చాలా సులభంగా కనెక్ట్ అవుతుంది. ఈ దీపావళికి కుటుంబంతో కలిసి థియేటర్లలో మనస్ఫూర్తిగా నవ్వుకోవచ్చు" అని అన్నారు. వేదిక వద్దకు రాలేకపోయిన అభిమానులకు ఆయన క్షమాపణలు చెప్పారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ, "ట్రైలర్ లాంచ్‌కు ఇంత భారీ స్పందన వస్తుందని ఊహించలేదు. ఈ దీపావళికి చాలా పెద్ద సినిమాలు విడుదలవుతున్నా, వాటన్నింటి కన్నా 'కె-ర్యాంప్' ఒక మెట్టు పైనే ఉంటుందని గట్టిగా నమ్ముతున్నాను. పోటీ ఉన్నప్పటికీ, మాకు మంచి థియేటర్లు దొరుకుతాయనే నమ్మకం ఉంది" అని తెలిపారు. సీనియర్ నటుడు నరేశ్ తనదైన శైలిలో మాట్లాడుతూ, "దీపావళికి కొనే పటాసులు కొన్ని నిమిషాలే పేలుతాయి. కానీ 'కె-ర్యాంప్' టికెట్ కొంటే రెండు గంటల పాటు నవ్వుల పటాసు పేలుతుంది. ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది" అని వివరించారు. దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ, "ట్రైలర్‌లో చూసింది సినిమాలోని కొంత ఎనర్జీ మాత్రమే. బడ్జెట్ పెరిగినా నిర్మాతలు వెనకాడకుండా సపోర్ట్ చేశారు. కిరణ్ నటన ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది" అని తెలిపారు. హాస్య మూవీస్, రుద్రాన్ష్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండా, శివ బొమ్మక్కు ఈ చిత్రాన్ని నిర్మించారు.

# తమిళనాడు సీఎం స్టాలిన్ చేతుల మీదుగా కలైమామణి పురస్కారం అందుకున్న సాయిపల్లవి



కళారంగంలో విశేష కృషి చేసిన ప్రతిభావంతులను తమిళనాడు ప్రభుత్వం సత్కరించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ 2021, 2022, 2023 సంవత్సరాలకు గాను "కలైమామణి" పురస్కారాలను ప్రదానం చేశారు. మొత్తం 90 మంది కళాకారులు వివిధ విభాగాలలో ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. 2021 సంవత్సరానికి గాను నటనా విభాగంలో ప్రముఖ నటి సాయిపల్లవి ఈ పురస్కారానికి ఎంపిక కాగా, ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా ఆమెకు అవార్డును అందజేశారు. అలాగే, నటులు ఎస్.జే. సూర్య, విక్రమ్ ప్రభు తదితరులు కూడా పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు. సంగీతం, నృత్యం, నాటకం, సినిమా వంటి విభాగాల్లో విశేష కృషి చేసిన కళాకారులను ప్రభుత్వం గుర్తించి సత్కరించింది. కలైమామణి పురస్కారం తమిళనాడులో కళారంగానికిచ్చే అత్యున్నత గౌరవంగా పరిగణించబడుతుంది. ఈ పురస్కారాల ద్వారా కళా సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.